
ప్రజాశక్తి

మంగళవారం 19 ఆగస్టు 2025



నేటి నుంచి ఆధార్ క్యాంపులు

ప్రజాశక్తి-కంటోన్మెంట్

జిల్లాలో ఇంకా 16 లక్షల మంది ఆధార్ మాండేటరీ బయోమెట్రిక్ అప్డేట్ చేయించుకోవలసి ఉందని గ్రామ, వార్డు సచివాలయాల ప్రత్యేకాధికారి రోజారాణి ఒక ప్రకటనలో తెలిపారు. వీరి కోసం మంగళవారం నుంచి ఆధార్ క్యాంపులు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. పాఠశాలల్లో చదువుతున్న పిల్లలు తమ కోర్ బయోమెట్రిక్స్‌ను ఆధార్ డేటా బేస్‌లో అప్‌డేట్ చేయడమే మాండేటరీ బయోమెట్రిక్ అని పిలుస్తారని పేర్కొన్నారు. ప్రతి సిటిజన్ లేదా విద్యార్థి రెండుసార్లు మాండేటరీ బయోమెట్రిక్స్‌ను అప్‌డేట్ చేయించుకోవాలని తెలిపారు. ఎంబియు 1-5 నుండి 15 సంవత్సరాల లోపల చేసుకోవలసి ఉంటుందని, ఎంబియు 2-15 సంవత్సరాల తర్వాత చేసుకోవలసి ఉంటుందని తెలిపారు. ఈ నేపథ్యంలో అత్యధిక విద్యార్థులు ఉన్న స్కూళ్లలో ఈ ఆధార్ డ్రైవ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.



నిండుకుండలా మడ్డువలస రిజర్వాయరు

ఉమ్మడి విజయనగరం జిల్లాలో గడిచిన మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు జలాశయాలు, చెరువుల్లో జలకళ కనిపిస్తోంది. కొన్ని తోటల్లో ప్రాంతాలు కూడా చెరువులను తలపిస్తున్నాయి. మూడు రోజుల క్రితం వరకు వర్షపునీటి కోసం ఎదురు చూసిన రైతులు, నేడు వర్షం తెరిపిస్తే ఉబాలు పట్టుకోవచ్చన్న రీతిలో ఎదురు చూస్తున్నారు. ముఖ్యంగా వంశధార, నాగావళి, గోముఖి, సువర్ణముఖి, చంపావతి తదితర నదుల్లో నీటి ప్రవాహ ఉధృతి పెరిగింది. దీంతో, తోటపల్లి, జంఝావతి, వెంగళరాయసాగర్, పెద్దగెడ్డ, ఆండ్ర, తాటిపూడి, మడ్డువలస, ఆండ్ర, నారాయణపురం ఆనకట్ట, డెంకాడ ఆనకట్ట తదితర జలాశయాల్లో నీటిమట్టాలు దాదాపు పూర్తి స్థాయికి చేరాయి. వర్షపునీరు చెరువుల్లో చేరి నిండుకుండల్లా కనిపిస్తున్నాయి. వర్షపునీటితో మిగిలిన ఉబాలు పట్టుకోవడానికి వీలు కనిపిస్తోంది. ఫలితంగా రైతుల్లో ఒకింత ఆనందం వ్యక్తమవుతోంది.



చంద్రంపేట, వసంత మధ్య కల్వర్టుపై రాకపోకలను నిలిపివేసిన ఎస్ఐ సాయికృష్ణ

ఉప్పొంగిన గెడ్డ

ప్రజాశక్తి-గంట్యాడ

మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండలంలోని చంద్రంపేట నుంచి వసంత గ్రామాల మధ్యనున్న గెడ్డ ఉధృతంగా ప్రవహిస్తోంది. ఆ గ్రామాల మధ్యనున్న కల్వర్టు పైనుంచి ఉప్పొంగి ప్రవహిస్తోంది. ఈ మార్గంలో నిత్యం వందల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తాయి. సోమవారం గెడ్డ ఉధృత రూపం దాల్చడంతో ముందస్తు జాగ్రత్తగా రాకపోకలను ఎస్ఐ సాయికృష్ణ నిలిపేశారు. కల్వర్టుకు ఇరువైపులా కర్రలతో కంచె ఏర్పాటు చేయించారు. చంద్రంపేట, వసంత గ్రామాల్లో కార్యదర్శులు సూర్యనారాయణ, సుధారాణి, విఆర్ఒ రవి ఆధ్వర్యంలో దండోరా వేయించారు.

10 వేల క్యూసెక్కుల నీరు విడుదల

వంగర : మండలంలోని గొర్లె శ్రీరాములు నాయుడు మడ్డువలస ప్రాజెక్టు నుంచి సోమవారం ఒక గేటు ద్వారా 10 వేల క్యూసెక్కుల నీరు దిగువకు విడిచి పెడుతున్నట్లు ప్రాజెక్టు ఎఇ కె.నితిన్ తెలిపారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 65 మీటర్లు కాగా, ప్రస్తుతం 64.19 మీటర్లకు చేరిందని చెప్పారు. సువర్ణముఖి, వేగావతి నదుల నుంచి 7393 క్యూసెక్కుల నీరు ప్రాజెక్టులోకి వచ్చి చేరుతోందన్నారు.

జలాశయాలు, చెరువులకు జలకళ

- పొంగిపొర్లుతున్న నదులు
- కొనసాగుతున్న వర్షాలు
- అప్రమత్తమైన అధికార యంత్రాంగం

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

విజయనగరం జిల్లాలో ఖరీఫ్ సీజన్ ప్రారంభం నుంచీ వర్షాలు బాగానే అనుకూలించినప్పటికీ జూన్ నెలలో 6.2 మిల్లీ మీటర్లు, జూలైలో 6.5 మి.మీ వర్షం లోటు ఉంది. ఈనెల (ఆగస్టు)లో ఇప్పటి వరకు 47.8 మి.మీ అధిక వర్షపాతం నమోదైంది. ఇందులో శుక్ర, శని, ఆదివారాల్లోనే అత్యధిక శాతం వర్షం కురిసింది. ఈనెల 16న 12.7 మి.మీ, 17న 14,3 మి.మీ చొప్పున వర్షపాతం నమోదుకాగా 18వ తేదీ ఒక్కరోజే 331.8 మి.మీ. వర్షం కురవగా సరాసరి 12.3 మి.మీ.గా నమోదైంది. సోమవారం అత్యధికంగా వేపాడ మండలంలో 132.8, లక్కవరపుకోట మండలంలో 108.2, కొత్తవలస మండలంలో 144.4 మి.మీ. వర్షం కురిసింది. అత్యల్పంగా రామభద్రపురం మండలంలో 19.7మి.మీ. వర్షం పడింది. సీజన్ మొత్తానికి పరిశీలిస్తే 20మండలాల్లో సాధారణ వర్షపాతం నమోదుకాగా, 8మండలాల్లో అధిక వర్షపాతం కురిసింది. అధిక వర్షపాతం నమోదైన మండలాల్లో మెరకముడిదాం, నెల్లిమర్ల, ఎస్.కోట, ఎల్.కోట, విజయనగరం రూరల్, పూసపాటిరేగ, డెంకాడ మండలాలు ఉన్నాయి. కొన్ని మండలాల్లో 25 నుంచి 33రోజుల వరకు కూడా వర్షపాతం నమోదైంది. ఈనెల 18 వరకు 11రోజులపాటు వర్షపాతం నమోదైంది. మరోవైపు వర్షాలు కొనసాగుతుండడంతో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. వర్షాల కారణంగా కష్టనష్టాలను నమోదు చేయడంతోపాటు అప్పటికప్పుడు అధికారులను అప్రమత్తం చేసేందుకు వీలుగా కలెక్టరేట్‌లో కంట్రోల్ రూం ఏర్పాటుచేశారు. కలెక్టర్ ఆదేశాలతో మండల ప్రత్యేక అధికారులంతా సోమవారం క్షేత్ర స్థాయి పరిశీలనకు వెళ్లారు.

ప్రాజెక్టుల నీటి మట్టాలు

రిజర్వాయరు	పూర్తి సామర్థ్యం	ప్రస్తుత నీటిమట్టం
తాటిపూడి	297 అడుగులు	290.80 అడుగులు
మడ్డువలస	65 మీటర్లు	64.18మీటర్లు
తోటపల్లి	105. మీటర్లు	104.20మీటర్లు
ఆండ్ర	146 మీటర్లు	140.75 మీటర్లు
పెద్దగెడ్డ	213.8 మీటర్లు	211.98 మీటర్లు
వట్టిగెడ్డ	121.62 మీటర్లు	117.07మీటర్లు
జంఝావతి		122.80మీటర్లు



మత్స్యకారులతో మాట్లాడుతున్న అధికారులు

తీరంలో అప్రమత్తం

ప్రజాశక్తి - పూసపాటిరేగ

అల్పపీడనం కారణంగా భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో తీరంలో అధికారుల అప్రమత్తమయ్యారు. మత్స్యకారులు ఎవరూ చేపల వేటకు వెళ్ళొద్దని మరోసారి హెచ్చరికలు జారీ చేశారు. తీరం వెంబడి బలమైన అలులు వేసే అవకాశం ఉన్నందున అప్రమత్తంగా ఉండాలని మరీ ముఖ్యంగా సముద్రం సమీపంలో నివాసాలు ఉంటున్న వారిని అప్రమత్తం చేశారు. ఇందులో భాగంగా సోమవారం మండలంలోని చింతపల్లి, కోనాడ గ్రామాల్లో తహశీల్దార్ ఎన్వి రమణ, ఎంపిడిఒ ఎం.రాధిక పర్యటించి మత్స్యకారులతో మాట్లాడారు. బంగాళాఖాతంలో అల్పపీడనం కారణంగా భారీ వర్షాలు నమోదయ్యే అవకాశం ఉన్నందున ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని ప్రజలను అప్రమత్తం చేశారు. మండల గ్రామస్థాయి అధికారులంతా అనుక్షణం అప్రమత్తంగా ఉండాలని సహాయక చర్యలు అందించే విధంగా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని విఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులకు తెలిపారు. ప్రమాదం జరిగే పరిస్థితులు ముందే గుర్తించాలని ప్రజలను ముందుగుండగానే సురక్షిత ప్రాంతాలకు తరలించాలని తాగునీరు పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కార్యదర్శులకు తెలిపారు. వర్షం తగ్గినా సముద్రంలోకి వేటకు వెళ్లకూడదని వెళ్తే వెళ్లిన వారిపై తగు చర్యలు తీసుకోవాలని తెలిపారు. భోగాపురం, పూసపాటిరేగ మండలాల్లో ప్రత్యేక దృష్టితో ఉండాలని సూచించారు.



సింగరాయి వద్ద కల్వర్టు మీదుగా ప్రమాదకరంగా ప్రవహిస్తున్న పెద్దగెడ్డ

జలదిగ్బంధనంలో సింగరాయి

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని సింగరాయి గ్రామం జలదిగ్బంధనంలో చిక్కుకొంది. సోంపురం- వేపాడ ప్రధాన రహదారి నుంచి సింగరాయి వెళ్లే మార్గంలో కల్వర్టు మీదుగా మారిక కొండల నుంచి వచ్చే వరదనీటితో పెద్దగెడ్డ ఉధృతంగా ప్రవహిస్తోంది. మరోవైపు చందులూరు వైపు వెళ్లాలంటే తమ్మయ్య చెరువు పూర్తిగా నిండిపోయింది. కిత్తన్నపేట వైపు వెళ్లాలంటే ఊరి చెరువు ఛానల్ పొంగిపొర్లుతోంది. ఏదో విధంగా ప్రధాన రోడ్డుకు వచ్చి శృంగవరపుకోట వెళ్లాలంటే సోంపురం జంక్షన్ వద్ద అండర్ రైల్వే బ్రిడ్జి పీక లోతు నీటితో నిండింది. అత్యవసర పరిస్థితుల్లో గ్రామస్తులు కల్వర్టు మీదుగా ప్రమాదకరంగా ప్రవహిస్తున్న గెడ్డలోనుంచి రాకపోకలు సాగిస్తున్నారు.

సోము చెరువు పరిశీలన

ఇటీవల కురుస్తున్న వర్షాలకు వేపాడ మండల కేంద్రంలోని సోముచెరువు నిండి, ప్రమాదస్థాయికి చేరింది. ఆయకట్టు రైతుల సమాచారంతో సోమవారం ఆ చెరువును ప్రత్యేకాధికారి రెడ్డయ్య, తహశీల్దార్ రాములమ్మ పరిశీలించారు.

పాక్షికంగా దెబ్బతిన్న ఇళ్లు

వర్షాలతో మండలంలోని కొంపల్లిలో రెండు ఇళ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి. కాకర పైడమ్మ, కాకర శ్రావణి ఇళ్లు పాక్షికంగా కూలినట్లు విఆర్ఒ శ్రీను తహశీల్దార్‌కు నివేదించారు.

అంతటా జలమయం

ప్రజాశక్తి-శృంగవరపుకోట

మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండలంలోని పలు ప్రాంతాలు జలమయ్యాయి. శృంగవరపుకోట నుంచి విజయనగరం వెళ్లే మార్గంలో పోతనపల్లి వద్ద రహదారిపై మోకాల్లోతు నీరు ప్రవహించింది. నీటి ప్రవాహానికి వరిపొలాలు నీట మునిగాయి. ధర్మవరం వైపు వెళ్లే వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. కొత్తూరు గ్రామానికి చెందిన గుండాల దిబ్బ వద్ద కళ్లాల్లోకి నీరు చేరింది. దీంతో పశువులు ఉంచేందుకు రైతులు ఇబ్బందులు పడ్డారు.



పోతనపల్లి వద్ద ముంపును పరిశీలిస్తున్న అధికారులు

పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల వద్ద విశాఖ-అరకు రహదారిలో రోడ్డుపై నీరు నిలిచి వాహనదారులు ఇబ్బందులు పడ్డారు.

ముంపు ప్రాంతాల పరిశీలన

మండలంలోని ముంపు ప్రాంతాలను ప్రత్యేకాధికారి రవికిరణ్ పరిశీలించారు. సోంపురం వద్ద ఆర్‌యుబి, శివరామరాజుపేట, పోతనపల్లి, కొత్తూరు తదితర ప్రాంతాల్లో పర్యటించి నీరు నిల్వ లేకుండా పోయేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ సతీష్, తహశీల్దార్ శ్రీనివాసరావు, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో నేడు, రేపు భారీ వర్షాలు

అధికారులు అప్రమత్తంగా ఉండాలి : కలెక్టర్ బిఆర్ అంబేద్కర్

ప్రజాశక్తి-విజయనగరం కోట

జిల్లాలో మంగళ, బుధ వారాల్లో వర్షాలు హెచ్చరికల నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఆదేశించారు. జిల్లాలో వాతావరణ పరిస్థితులపై సోమవారం కలెక్టరేట్ నుంచి జిల్లా, మండల స్థాయి అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. అధికారులు అప్రమత్తంగా ఉండాలని, అనుమతి లేకుండా హెడ్ క్వార్టర్ విడిచి వెళ్లకూడదని, అత్యవసర సమయంలో నిర్లక్ష్యంగా విధులు నిర్వహించే అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. మండల ప్రత్యేక అధికారులు, మండల అధికారులు గ్రామాలలో పర్యటించాలని, క్షేత్ర స్థాయి పరిస్థితులపై వెంటనే నివేదిక సమర్పించాలని తెలిపారు. నీటి పారుదల కాలువలు పర్యవేక్షణ చేయాలని, డ్రైనేజీ వ్యవస్థ, పారిశుధ్యంపై వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజలు, మత్స్యకారులు వాతావరణశాఖ సూచనలు పాటించాలని, ప్రజలను అప్రమత్తం చేయాలని అన్నారు. ఎస్.కోట, ఎల్.కోట, వేపాడ మండలాల్లో 100 మి.మీ. పైగా వర్షపాతం నమోదు అయిందని, రేపటి వరకు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున అధికారులు అప్రమత్తం గా ఉండాలన్నారు.

నాగావళి పరివాహక ప్రాంత సంతకవిటి, రాజాం, ఆర్. అముదాలవలస, వంగర మండలాల ప్రజలను ప్రజలను అప్రమత్తం చేయాలని తెలిపారు. మడ్డువలస రిజర్వాయర్ ఇన్ ఫ్లో, అవుట్ ఫ్లో నిలకడగా ఉందని, పరిస్థితిని నిరంతరం పర్యవేక్షణ చేయాలని అధికారులను ఆదేశించారు. తీర ప్రాంత ప్రజలను అప్రమత్తం చేయాలని, మత్స్యకారులకు వాతావరణశాఖ సూచనలు తెలియజేయాలని, గ్రామాల్లో దండోరా, మైక్ ద్వారా ప్రచారం చేయాలని పోలీస్, రెవిన్యూ, మత్స్య శాఖ అధికారులను అదేశించారు.



ముక్కలుగా విరిగిపోతున్న మారిక రోడ్డు

కుంగిపోయిన మారిక రోడ్డు

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని కరకవలస పంచాయతీ పరిధిలో మారిక గ్రామానికి నిర్మించిన రోడ్డు ఇటీవల కురిసిన వర్షాలకు కుంగిపోయింది. సుమారు రూ.7 కోట్లతో నిర్మిస్తున్న ఈ రోడ్డు పనులు పూర్తికాక ముందే ఎక్కడికక్కడ బీటలు వారింది. పనుల్లో నాణ్యతా లోపం వల్ల రోడ్డు పెచ్చులుగా విరిగిపోయి రాకపోకలకు వీల్లేకుండా తయారైంది. కాంట్రాక్టరు లాభాపేక్ష, అధికారుల పర్యవేక్షణా లోపమే దీనికి కారణమని సర్పంచ్ పెంటమ్మ, సిపిఎం నాయకులు చల్లా జగన్, గిరిజనులు ఆగ్రహం వ్యక్తంచేశారు. నాణ్యతతో రోడ్డు పనులు చేపట్టాలని డిమాండ్‌చేశారు.

ఫెర్రో పరిశ్రమలను తెరిపిస్తాం

బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్

ప్రజాశక్తి-విజయనగరంకోట

జిల్లాలో మూతపడిన ఫెర్రో ఎల్లాయిస్ పరిశ్రమలను తెరిపించేందుకు కృషి చేస్తామని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు పివిఎన్ మాధవ్ తెలిపారు. సోమవారం స్థానిక బిజెపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజా సమస్యలు తెలుసుకునేందుకు రాష్ట్ర మంతా పర్యటిస్తున్నట్లు తెలిపారు. పారిశ్రామిక వాడలన్నీ ఇటీవల కాలంలో మూతపడి పోయాయని తెలిపారు. జిల్లాలో ఉన్న ఫెర్రో పరిశ్రమల తిరిగి తెరిపించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేసేస్తున్నారు కదా అని విలేకర్లు అడిగిన ప్రశ్నకు ఆయన స్పందిస్తూ ముడిసరుకును అందించేందుకు కొన్ని విభాగాల నుంచి టెండర్లు పిలుస్తున్నారని తెలిపారు. అమెరికా పన్నుల కారణంగా ఆక్వా పరిశ్రమలు నేడు కష్టకాలంలో ఉన్నాయన్నారు. బిజెపిని అన్ని చోట్ల విస్తరించడానికి తగిన వ్యూహం రచిస్తున్నామన్నారు. రాహుల్ గాంధీ పెద్ద జోకర్‌గా మారారని విమర్శించారు. ఈనెల 30న సంచార జాతుల సాంస్కృతిక జీవనాన్ని తెలిపే ప్రత్యేక కార్యక్రమం రాష్ట్ర వ్యాప్తంగా చేపడతామని తెలిపారు. సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు గారపాటి సీతా రామాంజనేయ చౌదరి, రెడ్డి పావని, జిల్లా అధ్యక్షులు ఉప్పలపాటి రాజేష్ వర్మ తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు రింగ్‌రోడ్డ రైతు బజారు వద్ద నిర్వహించిన చాయ్ పే చర్చ కార్యక్రమంలో మాధవ్ పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల వద్ద డ్రగ్స్ వినియోగం జరుగుతున్న విషయం తన దృష్టికి వచ్చిందన్నారు. ఇటీవల విజయనగరంలో ఉగ్రవాద చర్యలకు పాల్పడుతున్న వ్యక్తి పట్టుబడటం ఆందోళన కలిగించిందన్నారు. నిఘా వ్యవస్థలు మరింతగా జాగురూతతో వ్యవహరించాలని తెలిపారు.

20న కానిస్టేబుల్ అభ్యర్థులు హాజరుకావాలి

ప్రజాశక్తి-కంటోన్మెంట్

పోలీసు కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఎంపికైన పురుష, మహిళా అభ్యర్థులు ఈ నెల 20న జిల్లా పోలీసు కార్యాలయానికి రావాలని ఎస్‌పి వకుల్ జిందల్ ఒక ప్రకటనలో సూచించారు. జిల్లాలో నిర్వహించిన సెలెక్షన్ ప్రక్రియకు హాజరైన అభ్యర్థుల్లో 723 మంది వివిధ జిల్లాల్లో సివిల్, ఎపిఎస్‌పి బెటాలియన్, ఎస్‌సిటి పోలీసు కానిస్టేబుళ్లగా ఎంపికయ్యారని తెలిపారు. అభ్యర్థులు సెలక్షన్ ప్రక్రియలో దరఖాస్తుతో జతపరిచిన ఒరిజినల్ ధ్రువపత్రాలు, గజిటెడ్ అధికారితో సంతకం చేయించిన మూడు సెట్ల జెరాక్స్ కాపీలు, మూడు పాస్‌పోర్టు సైజ్ కలర్ ఫొటోలతో ఉదయం 8 గంటలకు హాజరుకావాలని కోరారు.

అధికారుల తీరుపై కలెక్టర్ ఆగ్రహం



అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ అంబేద్కర్, డిఆర్ఒ శ్రీనివాసమూర్తి

- పనిచేయని అధికారులు మాకెందుకు ?
- విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు
- ఐసిడిఎస్ పీడీని సరెండర్ చేయాలని ఆదేశం

ప్రజాశక్తి- కంటోన్మెంట్

జిల్లా అధికారుల తీరుపై కలెక్టర్ బిఆర్ అంబేద్కర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో వినతుల స్వీకరణ అనంతరం ఆయన అధికారులను ఉద్దేశించి మాట్లాడారు. విపత్కర పరిస్థితుల్లో ప్రజలకు అందుబాటులో ఉండాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా ఉంటే కఠిన చర్యలు తప్పవన్నారు. పనిచేయని.. మెసేజ్ చూడని.. సకాలంలో హాజరు కాని..జిల్లా అధికారులపై కఠిన చర్యలు ఉంటాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. తుఫాను సమయంలో అప్రమత్తంగా ఉండాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా ఉంటున్నారని ఆగ్ర హం వ్యక్తం చేశారు. ఆదివారం రాత్రి 9.30 గంటల గంటల సమయంలో జిల్లా కలెక్టర్‌గా తాను మెసేజ్ పెడితే సోమవారం ఉదయం 10 గంటల వరకు మెసేజ్ చూడలేదని ఐసిడిఎస్ పీడీ టి.విమలా రాణి పై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మెసేజ్ లు చూడని అధికారులు మాకు ఎందుకంటూ వెంటనే సరెండర్ చేయాలని డిఆర్ఒకు ఆదేశించారు. తన అనుమతి లేకుండా జిల్లా కేంద్రం వదిలి వెళ్లిన సోషల్ వెల్ఫేర్ డీడీ పై ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లాలో వ్యాధులు ప్రబలుతున్న పట్టించుకోని, సకాలంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు హాజరు కాని డిఎంహెచ్ఒ ఎస్.జీవన్ రాణి పై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇకపై జిల్లా జిల్లా అధికారులందరూ ప్రజా ఫిర్యాదు పరిష్కార వేదిక కార్యక్రమానికి సకాలంలో హాజరు కాకపోతే నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు

అర్జీలకు వెంటనే పరిష్కారం చూపాలి

అర్జీలకు వెంటనే పరిష్కారం చూపాలని కలెక్టర్ బిఆర్ అంబేద్కర్ ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్ అంబేద్కర్, డిఆర్ఒ శ్రీనివాసమూర్తి , డిప్యూటీ కలెక్టర్‌లు వెంకటేశ్వర రావు, ప్రమీలా గాంధీ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల నుండి వచ్చిన అర్జీలకు వెంటనే పరిష్కారం చూపాలని, అర్జీలపై తీసుకున్న చర్యలను నిర్ణిత గడువు లోగా అర్జీదారులకు తెలియజేయాలని అధికారులను అదేశించారు. ప్రజలు సామాజిక, వ్యక్తిగత అంశాలపై 94 అర్జీలు అందజేశారు. వాటిలో రెవిన్యూ శాఖకు 32, డిఆర్‌డిఎకు 12 ఉన్నాయి.

'తల్లికి వందనం'కు పోస్టల్ అకౌంట్లు ఓపెన్ చేయాలి

ప్రజాశక్తి - కంటోన్మెంట్

తల్లికి వందనానికి సంబంధించి తల్లుల బ్యాంక్ అకౌంట్ల ఎన్‌పిసిఐ లింకింగ్ కాకపోవడం వల్ల కొందరికి డబ్బులు జమ కాలేదని జిల్లా గ్రామ, వార్డు సచివాలయాల సమన్వయకర్త రోజారాణి తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. డబ్బులు జమకాని తల్లుల చేత పోస్టల్ అకౌంట్లు ఓపెన్ చేయించాల్సిందిగా సంబంధిత వెల్ఫేర్ అసిస్టెంట్లకు ఆదేశించడం జరిగిందని తెలిపారు.

పోస్టల్ అకౌంటు ఓపెన్ చేసిన తర్వాత స్క్రీన్ షాట్‌ను వెల్ఫేర్ గ్రూప్‌లో షేర్ చేయాలని తెలిపారు.



ర్యాలీ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు

ఎలక్షన్ కమిషన్ ద్వంద్వ నీతి

ఇసి తీరుపై కాంగ్రెస్ నిరసన ర్యాలీ

ప్రజాశక్తి-విజయనగరంకోట

ఓట్ల చోరీపై కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీ ఆధారాలతో సహా బయటపెడితే చర్యలు తీసుకోవాల్సిన ఎన్నికల కమిషన్ ద్వంద నీతి అవలంభిస్తోందంటూ ఇసి తీరుకు నిరసనగా కాంగ్రెస్ ఆధ్వర్యాన సోమవారం రాత్రి ర్యాలీ చేపట్టారు. మూడులాంతర్లు నుంచి గంటస్తంభం వరకు చేపట్టిన ఈర్యాలీని ఉద్దేశించి డిసిసి అధ్యక్షులు మరిపి విద్యాసాగం మాట్లాడారు. దేశవ్యాప్తంగా ఓటర్ల జాబితాలో జరిగిన అవకతవకలపై తమ పార్టీ పోరాటం చేస్తోందన్నారు. 65 లక్షల ప్రతిపక్షాల ఓట్లను తొలగించిన ఎలక్షన్ కమిషన్‌ని రాహుల్ గాంధీ ప్రశ్నిస్తే! క్షమాపణ చెప్పమంటారా? అఫిడవిట్ అడుగుతారా? అని ప్రశ్నించారు. దొంగ ఓట్లపై బిజెపి ఎంపీ అనురాగ్ ఠాగూర్! ఇసిని ప్రశ్నిస్తే క్షమాపణ కోరరా? అఫిడవిట్ అడగరా? అన్నారు. ఇదేమి న్యాయం జ్ఞానేశ్వర? ఈ ఎలక్షన్ కమిషన్ రాజ్యాంగ వ్యవస్థనా? లేదా బిజెపి జేబు సంస్థనా? అంటూ ప్రశ్నించారు. బిజెపికి తొత్తుగా ఎలక్షన్ కమిషన్ వ్యవహరిస్తోందన్నారు. ఎన్నికల కమిషన్ తప్పిదాలకు నైతిక బాధ్యతగా వహించాలన్నారు. ఇసి జ్ఞానేశ్వర్, ఎలక్షన్ కమిషనర్లు సుఖ బీర్ సింగ్ సందు, వివేక్ జోషి రాజీనామా చేయాలన్నారు. ర్యాలీలో కాంగ్రెస్ నియోజకవర్గాల సమన్వయ కర్తలు డాక్టర్ గేదెల తిరుపతి, తదితరులతో పాటు మండల అ,ధ్యక్షులు, జిల్లా కాంగ్రెస్ కమిటీ సభ్యులు, యుత్ కాంగ్రెస్ అధ్యక్షులు పూడి శ్రీను, విద్యార్థి విభాగం ఆధ్యక్షులు గణేష్, జనరల్ సెక్రటరీ శ్రీనివాస్, షరీఫ్, సమీర్ పాల్గొన్నారు.

నేటి నుంచి డైట్ మూడో దశ కౌన్సిలింగ్

ప్రజాశక్తి-నెల్లిమర్ల

ఈనెల 19నుంచి 21 తేదీ వరకు డైట్ కళాశాలలో చేరేందుకు మూడో దశ ఆన్‌లైన్ కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నట్లు డైట్ ప్రిన్సిపాల్ కె.రామకృష్ణారావు ఒక ప్రకటనలో తెలిపారు. కౌన్సిలింగ్ లో సీటు వచ్చిన వారు ఈనెల 25 నుంచి 31లోపు కళాశాలలో చేరాల్సి ఉంటుందని తెలిపారు. కౌన్సిలింగ్‌కు ర్యాంక్ వచ్చిన వారు ఆన్ లైన్‌లో పాల్గొనాలని తెలిపారు.



అమ్మవారిని దర్శించుకుంటున్న సినీనటుడు సాయికుమార్ కుటుంబ సభ్యులు

పైడితల్లమ్మను దర్శించుకున్న సాయికుమార్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ప్రముఖ సినిమా హీరో సాయి కుమార్, ఆయన భార్య, కుమారుడు హీరో ఆదితో కలిసి సోమవారం నగరంలో పైడితల్లి అమ్మవారిని దర్శించుకున్నారు. నగరంలో ఓ పెళ్లి ఫంక్షన్‌కు విజయనగరం వచ్చిన ఆయన కుటుంబ సమేతంగా అమ్మవారిని దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ పండితులు ప్రత్యేక పూజలు నిర్వహించి, అనంతరం అమ్మవారి ప్రసాదాలు అందజేశారు.

రేపు జెడ్‌పి స్థాయీ సంఘ సమావేశాలు

ప్రజాశక్తి-కంటోన్మెంట్

ఈనెల 20న జిల్లా పరిషత్ స్థాయి సంఘ సమావేశాలు జరుగుతాయని సిఇఒ బివి సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ఆరోజు ఉదయం 11గంటలకు జెడ్‌పి సమావేశ మందిరంలో 1-7 స్థాయి సంఘాల సమావేశాలు జరుగుతాయని తెలిపారు.

రేపు డయల్ యువర్ ఆర్‌టిసి డిఎం

ప్రజాశక్తి-విజయనగరంకోట

స్థానిక ఆర్టీసి డిపో పరిసర ప్రాంతాల ప్రయాణికుల కోసం మంగళవారం డయల్ యువర్ డిఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు విజయనగరం డిపో మేనేజర్ జె. శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం సాయంత్రం నాలుగు గంటల నుంచి ఐదు గంటల వరకు ఈ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. డిపో పరిధిలో గల ప్రయాణికులంతా ఎటువంటి సమస్యలున్నా ఫోన్ ద్వారా తెలిపి నివృత్తి చేసుకోవాలని ఆయన కోరారు. సమస్యలపై డిపో మేనేజర్ ఫోన్ నంబర్ 9959225620 కు సంప్రదించాలన్నారు.

ఎంఇఒకి సత్కారం

ప్రజాశక్తి - నెల్లిమర్ల

జిల్లా స్థాయి ఉత్తమ ఎంఇఒకి సూర్యనారాయణమూర్తిని సోమవారం స్థానిక ఎంఆర్‌సి కార్యాలయంలో ఎంఆర్‌సి సిబ్బంది, సిఎంఆర్‌టి సిబ్బంది ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎంఇఒ సూర్యనారాయణమూర్తి మాట్లాడుతూ అందరి సహకారంతో ఉత్తమ అవార్డు వచ్చిందని ఇది మరింత భాద్యత పెంచి రానున్న రోజుల్లో మెరుగైన ఫలితాలు సాధించడానికి కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ- 2 వి.జ్ఞాన శంకర్, తదితరులు పాల్గొన్నారు.

డయేరియా నివారణపై అవగాహన

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని సింగరాయి గ్రామంలో డయేరియా నివారణపై సిహెచ్‌ఒ పార్థసారథి సోమవారం అవగాహన సదస్సు ఏర్పాటుచేశారు. డయేరియా రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎఎన్‌ఎం, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు

ప్రజాశక్తి-బొబ్బిలి

మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని పట్టణ సిఐ కె.సతీష్ కుమార్ హెచ్చరించారు. పట్టణంలో పోలీసుల తనిఖీలో డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో నలుగురిని, బహిరంగ మద్యపానం కేసులో 8 మందిని కోర్టులో హాజరు పరిచారు. మద్యం తాగి వాహనాలను నడిపిన నలుగురికి ఒక్కొక్కరికి రూ.10 వేలు, బహిరంగంగా మద్యం తాగిన 8 మందికి ఒక్కొక్కరికి రూ.500 జరిమానా విధిస్తూ జడ్జి హేమస్రవంతి తీర్పునిచ్చారని సిఐ చెప్పారు. మద్యం తాగి వాహనాలను నడిపినా, బహిరంగంగా మద్యం తాగినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

'అన్నదాత సుఖీభవ'పై 20లోగా ఫిర్యాదు చేయాలి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

అన్నదాత సుఖీభవ పథకంపై ఫిర్యాదుల స్వీకరణ గడువు ఈ నెల 20తో ముగుస్తుందని ఎఒ పి. శ్రీలక్ష్మి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అన్నదాత సుఖీభవ- పీఎం కిసాన్ పథకం ధృవీకరణ, ఈకెవైసి సమస్యలు, బ్యాంక్ ఖాతా వివరాలలో తప్పులు, ఇతర సాంకేతిక కారణాల వల్ల కొంతమంది అర్హతగల రైతుల ఖాతాల్లో జమకాలేదన్నారు. ఈ సమస్యలను పరిష్కరించేందుకు, వ్యవసాయశాఖ గ్రీవెన్స్ మాడ్యూల్‌ను అందుబాటులో ఉంచిందని. ఈ మాడ్యూల్ ద్వారా ఫిర్యాదుల స్వీకరణ గడువు ఈ నెల 20తో ముగుస్తుంది రైతులు వినియోగించుకోవాలని కోరారు.

డెంకాడ: అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ పథకం డబ్బులు పడని వారు ఆగస్టు 20 తారీకు లోపు రైతు సేవా కేంద్రాల్లో గ్రీవెన్స్ పెట్టుకోవాలని ఎఒ సంగీత ఒక ప్రకటనలో తెలిపారు రైతుకు సంబంధించిన వన్‌బి, ఆధార్ కార్డు, ఫోన్ నెంబరు రైతు సేవ కేంద్రంలో ఇవ్వాలన్నారు.

సిద్ధార్థకు ఘన సన్మానం

ప్రజాశక్తి- రేగిడి

మండలంలోని వావిలవలస రాహుల్ సౌరబ్ నిత్యాన్నదాన సత్రం నిర్వాహకుడు, సామాజిక కార్యకర్త పాలూరి సిద్ధార్థని విజయవాడ సిఎం సెక్యూరిటీవింగ్ ఎస్‌పి ఎస్ఎస్‌జి ఎస్‌పి భద్రయ్య సోమవారం సాలువాతో సన్మానించారు. గ్రామంలో నిరు పేద వృద్ధులకు తన సత్రంలో మూడు పూటలు భోజనం పెట్టి ఆదుకోవడంపై ప్రశంసించారు. మానవతా దృక్పథంతో ప్రతి ఒక్కరూ దిక్కులేని ఆ పేద వృద్ధులకు అండగా ఉండాలని కోరారు. నిరుపేద వృద్ధులకు తమవంతు సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ఆయన సేవలకు ఎస్‌పి అభినందనలు తెలిపారు.

ఫిర్యాదుదారులకు న్యాయం చేస్తాం : ఎస్‌పి

ప్రజాశక్తి -కంటోన్మెంట్

ఫిర్యాదు దారుల వినతులను పరిశీలించి న్యాయం చేయాలని ఎస్‌పి వకుల్ జిందాల్ పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో వినతులు స్వీకరించారు. మొత్తం 27 ఫిర్యాదులు వచ్చాయి. అనంతరం పోలీసు అధికారులతో మాట్లాడుతూ సమస్యలను సంబంధిత అధికారులకు వివరించారు. ఫిర్యాదుదారుల సమస్యల పట్ల సానుకూలంగా స్పందించాలని, ఫిర్యాదుల పరిష్కారానికి చట్టపరిధిలో చర్యలు చేపట్టి, న్యాయం చేయాలని ఆదేశించారు. ఫిర్యాదులపై తీసుకున్న చర్యల వివరాలను నివేదిక రూపంలో జిల్లా పోలీసు కార్యాలయానికి పంపాలని సంబంధిత పోలీసు అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎఎస్‌పి పి.సౌమ్యలత, ఎస్‌బి సిఐ ఎ.వి.లీలారావు, డిసిఆర్‌బి సిఐ బి.సుధాకర్, ఎస్ఐ రాజేష్ పాల్గొన్నారు.



బాధితురాలి సమస్యలు వింటున్న ఎస్‌పి వకుల్ జిందల్

మద్యం బార్లకు 26వరకు దరఖాస్తుల స్వీకరణ

- 28న కలెక్టరేట్‌లో డ్రా
- జిల్లాలో 28 బార్ షాపులు ఏర్పాటు
- పార్వతీపురంలో 8 బార్ మద్యం షాపులకు దరఖాస్తుల స్వీకరణ
- ఎక్సైజ్‌శాఖ డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస చౌదరి



లాటరీ ద్వారా బార్‌లకు రిజర్వేషన్ కేటాయిస్తున్న అధికారులు

ప్రజాశక్తి- కంటోన్మెంట్

విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాలో నూతన మద్యం బార్ షాపులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రొహిబిషన్ అండ్ ఆబ్కారీ శాఖ డిప్యూటీ కమిషనర్ వై శ్రీనివాస్ చౌదరి తెలిపారు. సోమవారం డిప్యూటీ కమిషనర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నూతన బార్ పాలసీ 2025-28 సంబంధించి గెజిట్ నోటిఫికేషన్ సోమవారం విడుదల అయ్యిందన్నారు. విజయనగరం జిల్లాలో 28, పార్వతీపురం మన్యం జిల్లాలో 8మద్యం బార్ షాపులకు ఈనెల 26 వరకు ఆన్‌లైన్ లేదా నేరుగా విజయనగరం, పార్వతీపురం కలెక్టరేట్లో ఉండే సూపరిండెంట్ కార్యాలయంలో దరఖాస్తులను అందించాలన్నారు. విజయనగరం పట్టణంలో 18, బార్ షాపులు రాజాం 5, భోగాపురం విఎంఆర్‌డిఎ పరిధిలో ఒకటి బొబ్బిలిలో 4బార్ షాపులు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. విజయనగరం జిల్లాలో కల్లుగీత కార్మికులకు విజయనగరం, నెల్లిమర్ల రాజాంలో మూడు బార్ షాపులు, పార్వతీపురం జిల్లాలో పార్వతీపురం పాలకొండ కేటాయించినట్లు తెలిపారు. పార్వతీపురం జిల్లాలో 8 బార్ షాపులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు పార్వతీపురం 4, సాలూరులో 4 కేటాయించామన్నారు. కలెక్టర్ ఛాంబర్ లో నిర్వహించిన లాటరీ ప్రకారం నెల్లిమర్ల నగర పంచాయతీ లో యాత కులానికి ఒకటి, రాజాం నగర పంచాయతీ లో యాత కులానికి ఒకటి, విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ లో సిగిడి కులానికి ఒకటి కేటాయించినట్లు తెలిపారు.

5 లక్షల రూపాయలు దరఖాస్తు ఫీజు

బార్ షాపులకు దరఖాస్తు చేసినందుకు ఐదు లక్షల రూపాయలు ఫీజు, రూ.10వేలు రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించాలన్నారు. ఒక్కో బార్ షాప్‌నకు నాలుగు దరఖాస్తుల పైబడి వస్తేనే డ్రా తీస్తామన్నారు. నాలుగు కంటే తక్కువ దరఖాస్తులు వస్తే మరల దరఖాస్తులకు సమయాన్ని పెంచే అవకాశముందన్నారు. సమావేశంలో ఎక్సైజ్‌శాఖ సూపరిండెంట్ బి శ్రీనాదుడు పాల్గొన్నారు

విజయనగరం మద్యం బార్ షాపు యాత కులానికి కేటాయించాలి

విజయనగర జిల్లా కేంద్రంలో మద్యం బార్ షాపును యాతకులానికి కాకుండా శ్రీశైన కులానికి బార్ షాపు కేటాయించడం పట్ల యాత కులస్తులు సంఘ నాయకులు కోరారు. గత వైన్‌షాపుల్లో కూడా విజయనగరం జిల్లా కేంద్రంలో యాతలు ఎక్కువగా నివాసం ఉన్నప్పటికీ వైన్ షాపులను శెట్టిబలిజలకు కేటాయించారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం, అధికారులు స్పందించి యాతకులస్తులు ఎక్కువ నివాసం ఉండే విజయనగరంలో యాత కులానికి మద్యం బార్ షాపును కేటాయించాలని కోరారు.

ఆకులలోవకట్ట గెడ్డను పరిశీలించిన ఆర్‌డిఒ

ప్రజాశక్తి- రేగిడి

మండలంలోని వెంకంపేట సమీపంలో ఆకులలోవ కట్టగెడ్డ ఉధృతిని, పంటల ముంపు పొలాలను చీపురుపల్లి ఆర్‌డిఒ ఆశయ్య సోమవారం పరిశీలించారు. సాలూరు నుంచి ప్రవహించే ఆకులలోవ కట్టగెడ్డ తుపాను వర్షాలకు పలు గ్రామాలకు వెళ్లే తారు రోడ్ల మీదుగా ప్రవహించడంతోపాటు పంట పొలాల్లోకి నీరు చేరడంతో ఆయన పరిశీలించారు. నాగావళి వరద ముంపును ఎప్పటికప్పుడు సమాచారం అందించాలని తహశీల్దార్ కృష్ణలతకు ఆదేశించారు. నదీ పరివాహక ప్రాంత గ్రామాలలో సిబ్బందిని ఉండేలా చూడాలన్నారు. వరదపై ఎప్పటికప్పుడు సమాచారం అందించాలని సూచించారు. మరి రెండు రోజులు పాటు వర్షం పడే అవకాశం ఉందని అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ కృష్ణల, ఆర్ఐ కిరణ్ కుమార్, వ్యవసాయ మండల అధికారి శ్రీనివాసరావు, విఆర్‌లు పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

వర్షాలకు నాగావళి నది పొంగి ప్రవహించవచ్చునని, పరివాహక ప్రాంత గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహశీల్దార్ ఐ.కృష్ణలత సూచించారు. సోమవారం మండలంలోని సంకిలి, బొడ్డవలస, రేగిడి, తునివాడ, కందిస తదితర గ్రామాల నాగావళి నది వరద ముంపును ఆమె పరిశీలించారు. ఇప్పటికే కొమిరి, వెంకటాపురం, కందిశ, తునివాడ గ్రామాలు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

వంగర: భారీ వర్షాలు నేపథ్యంలో గ్రామాల్లో అధికారులు అప్రమత్తంగా ఉండాలని చీపురుపల్లి ఆర్‌డిఒ బి.ఆశియ్య అధికారులకు సూచించారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. వర్షాలు కురుస్తునడంతో మండలంలో 14 పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ప్రజలను అప్రమత్తం చేయాన్నారు. గొర్లె శ్రీరాముల నాయుడు మడ్డువలస ప్రాజెక్టు నీటి పరిస్థితిపై ఎప్పటికప్పుడు కలెక్టర్ కార్యాలయానికి తెలియజేయాలన్నారు. వర్షాల వల్ల పంటలకు ఎలాంటి నష్టమూ జరగకుండా రైతులకు సూచనలు ఇవ్వాలని ఆదేశించారు. ఈ సమావేశంలో తహశీల్దార్ రాజశేఖర్, ఎంపిడిఒ ఎస్ రఘునాథాచారి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఆకులలోవ కట్టగెడ్డ వద్ద సిబ్బందితో మాట్లాడుతున్న ఆర్‌డిఒ ఆశయ్య



వర్షాల నేపథ్యంలో అప్రమత్తం : కమిషనర్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ప్రస్తుతం కురుస్తున్న వర్షాల నేపథ్యంలో లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలనినగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య స్పష్టం చేశారు. మరో రెండు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రతి ఒక్కరూ ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. సోమవారం నగరంలోని పలు ప్రాంతాల్లో పర్యటించిన ఆయన వర్షపు నీటి వల్ల ఎదురైన ఇబ్బందులను గమనించారు. రహదారులపై నీటి ప్రవాహానికి అడ్డంకులు లేకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని సంబంధిత సిబ్బందికి ఆదేశించారు. ప్రధాన కాలువల్లో చెత్తలు నిల్వ లేకుండా జెసిబి ల సహాయంతో ప్రక్షాళనా చర్యలను యుద్ధ ప్రాతిపదికను చేపట్టాలని చెప్పారు. ట్యాంక్ బండ్ రోడ్డు వద్ద పెద్ద చెరువు అవుట్ ఫ్లో ప్రాంతాన్ని పరిశీలించారు. వర్షాల వల్ల ఎవరికైనా సమస్యలు తలెత్తినట్లయితే తక్షణమే నగరపాలక సంస్థ కార్యాలయం హెల్ప్ లైన్ నెంబర్ 98499 06486 కు ఫోన్ చేసి తగు సహాయాన్ని పొందవచ్చునని తెలిపారు.



కాలువలను పరిశీలిస్తున్న కమిషనర్ రామలక్ష్మి

లోతట్టు ప్రాంతాల్లో కమిషనర్ పర్యటన

ప్రజాశక్తి-బొబ్బిలి

అల్పపీడన ప్రభావంతో వర్షాలు కురవడంతో లోతట్టు ప్రాంతాల్లో సోమవారం మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి పర్యటించారు. పట్టణంలోని మేదరబంద, నంబియార్ వేణు మిల్లు రోడ్డు, టిబిఆర్ థియేటర్ రోడ్డులో పర్యటించి, పారిశుధ్య పనులను పరిశీలించారు. రోడ్లు, ఖాళీ స్థలాల్లో వరదనీరు నిల్వ లేకుండా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. రోడ్డు పక్కన ఉన్న మట్టి దిబ్బలను తొలగించాలన్నారు. రోడ్లు, కాలువలను శుభ్రం చేయాలని సూచించారు. ఆమెతో శానిటరీ ఇన్‌స్పెక్టర్ మురళి, సిబ్బంది ఉన్నారు.

విజయనగరంలో సైబర్ మోసం

రూ.22 లక్షలు కాజేసిన కేటుగాడు

ప్రజాశక్తి-కంటోన్మెంట్

నగరంలో భారీ సైబర్ మోసం చోటుచేసుకుంది. విజయనగరం వన్ టౌన్ పోలీసుల కథనం ప్రకారం.. నగారినికి చెందిన టి.మోహన్ అకౌంట్ నుంచి సైబర్ మోసగాడు దపదఫాలుగా రూ.20 లక్షల వివిధ రూపాల్లో లాగేశాడు పరిశ్రమ ఏర్పాటు చేసేందుకు సహకరిస్తానని చెప్పి 9సార్లు వివిధ రూపాల్లో బ్యాంక్ అకౌంట్లో డబ్బులు వేయించుకొని తర్వాత ఫోన్ బ్లాక్ లో పెట్టేసాడు. దీంతో బాధితుడు విజయనగరం వన్ టౌన్ పోలీసులకు సోమవారం ఫిర్యాదు చేశాడు.దీంతో విజయనగరం వన్ టౌన్ సిఐ ఆర్.వి.ఆర్.కె చౌదరి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు

అంటువ్యాధుల పట్ల అప్రమత్తం

ప్రజాశక్తి-కొత్తవలస

ఇటీవల కురుస్తున్న వర్షాలతో అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కొత్తవలస, వియ్యంపేట పిహెచ్‌సిల వైద్యులు గోపాలకృష్ణ, సీతల్ వర్మ తెలిపారు. వర్షాలతో నీరు కలుషితం అవుతుందని, అందరూ కాచి చల్లార్చిన నీటినే తాగాలని సూచించారు. వేడి ఆహార పదార్థాలు తినాలని, వండిన వాటిపై మూతలు పెట్టాలని తెలిపారు. నిల్వ, రోడ్డు పక్కన బండ్లపై ఆహార పదార్థాలు తినరాదని కోరారు. మలేరియా, డెంగీ, టైఫాయిడ్, జ్వరాలకు ఉచితంగా రక్త పరీక్షలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. క్షేత్ర స్థాయిలో ఎంఎల్‌హెచ్‌పిలు, ఎఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు అందుబాటులో ఉంటారని చెప్పారు.

ఇస్రోలో సీతం విద్యార్థుల ఇంటర్న్‌షిప్

ప్రజాశక్తి-విజయనగరంకోట

సీతం ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులకు సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ శ్రీహరికోటలో ఇంటర్న్‌షిప్ చేసేందుకు అపూర్వ అవకాశం దక్కింది. బిటెక్ ఫైనల్ ఇయర్ చదువుతున్న కర్రీ సునైనా నాయుడు, మండల త్రివేణి విద్యార్థులకు రెండు నెలలపాటు ఇంటర్న్ షిప్ చేసే అవకాశం దక్కింది. వీరిద్దరూ 17 జూన్ నుండి ఆగస్టు 13 వరకు ఇంటర్న్‌షిప్ పూర్తిచేసుకుని సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ నుంచి సర్టిఫికెట్స్ అందుకొని సీతం కళాశాలకు ఎనలేని గుర్తింపు తీసుకొచ్చారు. వీరు కృత్రిమ మేధస్సు, యంత్ర అభ్యాసాన్ని ఉపయోగించి రాడార్ అమరిక (రాడార్ డేటా కాలిబ్రేషన్) ప్రాజెక్ట్‌పై శిక్షణ పూర్తి చేసుకున్నారు. వీరిని కళాశాల డైరెక్టర్ మజ్జి శశిభూషణరావు, ప్రిన్సిపాల్ డివి రామ్మూర్తి అభినందించారు.

విద్యార్థి సంఘాల ప్రవేశంపై నిషేధాన్ని ఎత్తి వేయాలి

ప్రజాశక్తి- కంటోన్మెంట్

విద్యాసంస్థల్లో విద్యార్థి సంఘాల ప్రవేశంపై జారీ చేసిన నిషేధ ఉత్తర్వుల్ని ఉపసంహరించుకోవాలని వైసిపి యువజన విద్యార్థి విభాగాల ఆధ్వర్యాన సోమవారం అంబేద్కర్ విగ్రహాల వద్ద నిరసనలు చేపట్టారు. రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లోకి యువజన విద్యార్థి సంఘాలు ప్రవేశించొద్దని కూటమి ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన పదిహేను నెలల్లోనే విద్యారంగాన్ని పూర్తిగా నీరుగార్చిందన్నారు. ప్రభుత్వ వైఫల్యాలు బహిర్గతం అవుతాయనే భయంతోనే విద్యార్థి సంఘాలను ప్రభుత్వ విద్యాసంస్థల్లోకి రాకుండా చీకటి ఉత్తర్వులిచ్చిందని మండిపడ్డారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు విద్యార్థి సంఘాలతో సమావేశాలు నిర్వహించిన లోకేష్ నేడు ఇలాంటి ఉత్తర్వులివ్వడం ఏంటని ప్రశ్నించారు. పాఠశాలల్లో విద్యార్థులకిచ్చిన బ్యాగులు నెల రోజుల్లోనే చిరిగిపోతున్నాయని, మధ్యాహ్న భోజనం అత్యంత నాసిరకంగా ఉందని, తెలుగు మీడియంను అటకెక్కించారని, నాడు - నేడు రద్దు చేసి పాఠశాలల్ని నిర్వీర్యం చేశారని, ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో కనీస వసతుల్ని కల్పించలేదని తెలిపారు. ఇలాంటి సమస్యలన్నీ విద్యార్థి సంఘాల దృష్టికి వస్తాయనే ఈ ఉత్తర్వులిచ్చారని విమర్శించారు. విద్యార్థుల సమస్యల్ని ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చి వాటి సమస్యల పరిష్కారానికి పోరాటాలు చేసేది విద్యార్థి సంఘాలే అని తెలిపారు. ఉత్తర్వుల్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేసారు. వైసిపి జిల్లా యువజన విభాగం ఇన్చార్జ్ ఈశ్వర్ కౌశిక్, జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షులు కరుముజు సాయి, పట్టణ యువజన విభాగ ఇన్చార్జ్ బోడసింగి ఈశ్వరరావు, యువజన విభాగ నాయకులు భార్గవ్, వర్ధన్, లంక సురేష్, లంక నరేష్, బాలి ప్రతాప్, గౌతమ్, ధనరాజ్ మరియు పట్టణ విద్యార్థి విభాగ నాయకులు పొన్నాడ మణికంఠ, వివేక్, హర్ష, మణి భగవాన్, బన్నీ, జస్వంత్ తదితరులు పాల్గొన్నారు.

26న డిబిఎస్‌యు జిల్లా మహాసభ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

దళిత బహుజన శ్రామిక యూనియన్ జిల్లా మహాసభ ఈనెల 26న యూత్‌హాస్టల్‌లో జరుగుతుందని ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.చిట్టిబాబు తెలిపారు. సోమవారం డిబిఎస్‌యు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. 25 సంవత్సరాలుగా దళిత ఆదివాసి బహుజనుల హక్కుల పరిరక్షణకు సంఘం కృషి చేస్తున్నదని తెలిపారు. అత్యాచారాల నిర్మూలనకు ఆత్మగౌరవ జీవనానికి, భూ సాధనకు సమాన మహిళా భాగస్వామ్య సాధన దిశగా పనిచేస్తుందని తెలిపారు. అత్యాచార బాధితులకు న్యాయం జరిగించేందుకు ఎస్సీ, ఎస్టీ ఆచారాలు నిర్మూలన చట్టాన్ని పటిష్టంగా అమలు చేయించేందుకు, సబ్‌ప్లాన్ చట్టాన్న ప్రకారం నిధుల కేటాయింపు, వాటి వినియోగం, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు చేపట్టి కార్యక్రమాలను సమీక్షించుకొని ఈ మహాసభలో భవిష్యత్తు కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకుంటామని తెలిపారు. మహాసభలో రాష్ట్ర జాతీయ నాయకులు పాల్గొంటారని తెలిపారు. ఆరోజు ఉదయం 10 గంటలకు కలెక్టరేట్ వద్ద గల జ్యోతిరావు పూలే విగ్రహం దగ్గర నుండి ర్యాలీ ప్రారంభమై యూత్ హాస్టల్ వరకు కొనసాగుందన్నారు. దళిత ఆదివాసీలు, మేధావులు, ప్రజాతంత్ర వాదులు, ప్రజాసంఘాలు ప్రతినిధులు పాల్గొని సంఘీభావం తెలిపి జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో డిబిఎస్‌యు జిల్లా ప్రతినిధులు మొండూరి రాజు, యు.రాము, జిల్లా శ్రామిక మహిళా కన్వీనర్ కోరుకొండ వరలక్ష్మి, కళ్యాణి రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.



మహాసభ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డిబిఎస్‌యు నాయకులు చిట్టిబాబు తదితరులు



అక్రమ రిజిస్ట్రేషన్లు రద్దు చేయాలి

ప్రజాశక్తి-శృంగవరపుకోట

రైతుల నుంచి జిందాల్ కంపెనీ అక్రమంగా చేయించుకున్న రిజిస్ట్రేషన్లను వెంటనే రద్దు చేయాలని ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు, సిపిఎం నాయకులు చల్లా జగన్ డిమాండ్ చేశారు. ఈ మేరకు జిందాల్ నిర్వాసితులతో కలిసి సోమవారం తహశీల్దార్ శ్రీనివాసరావుకు వినతి పత్రాన్ని అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ జిందాల్ యాజమాన్యానికి దెప్పూరు, బందవలస గ్రామస్తులకు తెలియకుండానే రిజిస్ట్రేషన్ జరిగిపోయాయని తెలిపారు. జిందాల్ నిర్వాసితులకు భూమి తీసుకున్నప్పుడు ఇచ్చిన హామీలు, చేసిన ఒప్పందాలు ఏవీ అమలు చేయలేదన్నారు. అందువల్ల అక్రమ రిజిస్ట్రేషన్ రద్దు చేసే అధికారం ప్రస్తుతం కలెక్టర్‌కి ఉందని, వెంటనే నిర్వాసితులకు భూములను అప్పగించాలని కోరారు. ఈ విషయమై తహశీల్దార్ శ్రీనివాసరావు మాట్లాడుతూ వినతిపత్రంలోని అంశాలను జిల్లా కలెక్టర్‌కు నివేదిస్తానని తెలిపారు.

కుష్టు బాధితులకు రోటరీ క్లబ్ విరాళం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

కుష్టు వ్యాధి బాధితులను ఆదుకోవడానికి దాతలు ముందుకు రావాలని డాక్టర్ వెంకటేశ్వర రావు కోరారు. నరవ లెప్రసీ కాలనీలో కుష్టు రోగులకు ప్రత్యేక పాదరక్షలు సోమవారం పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ వెంకటేశ్వర రావుతో పాటు, రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ బివి శ్రీనివాసరావు, కార్యదర్శి బి.రాధికా రాణి, సభ్యులు నీతా పాల్గొన్నారు. కుష్టు రోగులకు ప్రత్యేక పాదరక్షలు నిమిత్తం డాక్టర్ వెంకటేశ్వర రావు, విజయనగరం రోటరీ క్లబ్ రూ.62500 విరాళం లెప్రా సొసైటీ రిసోర్స్ ఎగ్జిక్యూటివ్ లెంక రమణకు అందించారు. రోటరీ క్లబ్ ప్రెసిడెంట్, కార్యదర్శి మాట్లాడుతూ కుష్టు వ్యాధిగ్రస్తులపై వివక్ష చూపరాదన్నారు. కుష్టు బాధితులకు ఉచితంగా ప్రత్యేక పాదరక్షలు, సెల్ఫ్ కేర్ కిట్లు, ఫిజియో థెరపీ సేవలు అందించేందుకు దాతల నుంచి విరాళాలు సేకరిస్తున్నట్లు చెప్పారు.

టెన్త్ మెరిట్ విద్యార్థులకు సన్మానం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

మదర్ తెరిసా సేవా సంఘం, బ్లడ్ డోనర్స్ క్లబ్ 8వ వార్షికోత్సవం సందర్భంగా అయ్యన్నపేట జంక్షన్ లో ఉన్న మదర్ తెరిసా కిడ్స్ స్కూల్‌లో 2024-25 సంవత్సరానికి నగరంలో పదవ తరగతిలో అత్యధిక మార్కులు వచ్చిన 15 మంది విద్యార్థులకు రూ.500 నగదు పారితోషకం అందజేశారు. మెమెంటో, ప్రముఖ వ్యక్తుల జీవిత చరిత్ర పుస్తకం, పూలబొకేతో, సేవా సంఘం ఫౌండర్ అధ్యక్షులు- త్యాడ ప్రసాద్ పట్నాయక్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ముఖ్యఅతిథిగా హాజరైన రిటైర్డ్ పరిషత్ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ మురహరి విశ్వేశ్వరరావు మాట్లాడుతూ బాగా చదివి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో నెల్లిమర్ల డిప్యూటీ తహశీల్దార్ (ఎలక్షన్స్) వివిఆర్ జగన్నాథరావు, సంఘ గౌరవ అధ్యక్షులు త్యాడ వేణుగోపాలం తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టులకు సన్మానం

ప్రజాశక్తి-బొబ్బిలి

జర్నలిజంలో 25 ఏళ్లు పూర్తి చేసుకున్న ఏడుగురు జర్నలిస్టులను రోటరీ క్లబ్, కారుణ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం ఎన్ఆర్ఐ ఆసుపత్రిలో ఎమ్మెల్యే బేబినాయన సన్మానించారు. ఈ సందర్భంగా బేబినాయన మాట్లాడుతూ ప్రజలకు, ప్రభుత్వానికి వారధిగా జర్నలిస్టులు పని చేయాలని కోరారు. ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రాంబార్కి శరత్, రోటరీ క్లబ్ ప్రతినిధులు జెసి రాజు, వారణాసి శ్రీహరి, గెంబలి శ్రీనివాసరావు, శివకాంత్, సభ్యులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

విద్యుదాఘాతంతో యువకుడు మృతి

ప్రజాశక్తి -కంటోన్మెంట్

విజయనగరంలోని కాటవీధి జంక్షన్లో విద్యుత్ షాక్ తో యువకుడు మృతి చెందాడు. టూ టౌన్ పోలీసులు కథనం ప్రకారం.. కాటవీధి జంక్షన్లో సత్యా ఇంజినీరింగ్ వెల్డింగ్ వర్క్ షాపులో శివమౌళి (22) వెల్డింగ్ పనులు చేస్తుండగా విద్యుత్ షాక్ తగిలి తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే అతడిని విజయనగరం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి తరలించారు అప్పటికే ఆయన మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. శివమౌళి తండ్రి అద్దేపల్లి అప్పలరాజు సోమవారం వచ్చిన ఫిర్యాదు మేరకు టూ టౌన్ ఎస్ఐ కనకరాజు కేసు దర్యాప్తు చేస్తున్నారు

విద్యుత్ స్తంభాన్ని ఢీకొని వ్యక్తి దుర్మరణం

ప్రజాశక్తి-రామభద్రపురం

మండలంలోని ఎస్.సీతారాంపురానికి చెందిన వెన్నెల అప్పారావు (31) అదే గ్రామం వద్ద సోమవారం బైక్‌తో విద్యుత్ స్తంభాన్ని ఢీకొని అక్కడికక్కడే మతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. అప్పారావు పనిపై బయటకు వెళ్లి ద్విచక్ర వాహనంపై గ్రామానికి వెళుతుండగా వర్షం కారణంగా బండి అదుపు తప్పడంతో విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టాడు. తీవ్ర గాయాలతో అక్కడే ఆయన చనిపోయాడు. జూన్‌లోనే అప్పారావుకు వివాహమైంది. ఆయన భార్య ప్రశాంతకుమారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ప్రసాదరావు తెలిపారు.

చెల్లూరు వద్ద బస్సు బోల్తా

11 మందికి స్వల్ప గాయాలు

ప్రజాశక్తి - కంటోన్మెంట్

విజయనగరం మండలం చెల్లూరు వద్ద ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు బోల్తా పడడంతో 11 మందికి స్వల్ప గాయాలయ్యాయి. వెంకటరమణ ట్రావెల్స్ బస్సు హైదరాబాదు నుండి విజయనగరం వచ్చే సందర్భంగా చెల్లూరు వద్ద సోమవారం ఉదయం డ్రైవర్ బస్సును నిలిపాడు. తిరిగి ప్రయాణం సందర్భంలో బస్సు బ్యాక్ వీల్ టైరు డివైడర్ ఎక్కడ వల్ల బస్సు బోల్తా పడింది. ఈ ప్రమాదంలో 11 మందికి స్వల్ప గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న విజయనగరం రూరల్ పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. గాయపడిన వారిని ఆసుపత్రికి తరలించారు.

యువతిని మోసగించిన కేసులో ఏడాది జైలు

ప్రజాశక్తి -కంటోన్మెంట్

మహిళా పోలీసు స్టేషనులో 2023 సంవత్సరంలో నమోదైన పోక్సో కేసులో నిందితుడు కొత్తపేటకు చెందిన దశమంతుల లక్ష్మణరావు (22)కు విజయనగరం పోక్సో కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి కె.నాగమణి ఏడాది జైలు శిక్ష, రూ.1000 జరిమానా విధిస్తూ సోమవారం తీర్పు చెప్పారు. లక్ష్మణరావు పట్టణానికి చెందిన ఒక మైనరు బాలికను వెంటపడుతూ నమ్మించి పెండ్లి చేసుకుంటానని మోసం చేసి లైంగిక నేరానికి పాల్పడ్డాడనిమహిళా పోలీసు స్టేషన్లో ఫిర్యాదు నమోదైంది. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి తీర్పు వెల్లడించారని డిఎస్‌ఇ ఆర్.గోవిందరావు తెలిపారు.